బీసీలు సంఘటితం కావాలి

పలు కార్యక్రమాల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 9: బీసీ కులాల ప్రయోజనాల కోసం తాను కృషి చేస్తున్నానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. అన్ని బీసీ కులాలు సంఘటితంగా వ్యవహరిస్తూ తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. బీసీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. బౌద్ధనగర్‌లో గంగపుత్ర స్థానిక సంఘం నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వెనుకబడిన కులాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ వారికి తమ వంతు ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తాము బీసీల హక్కుల సాధనకు సహకరిస్తామని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ సంఘం నూతన భవన నిర్మాణానికి పద్మారావు కూడా వ్యక్తిగతంగా తన వంతు విరాళం అందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌వీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ప్రత్యేకంగా ఆస్థమా, పల్మనాలజీ విభాగాలకు సంబంధించిన జబ్బులను గుర్తించి, ఉచితంగా వైద్యం అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ వైద్యం పేదలకు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు తగిన వైద్య సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యరంగాలకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు.

గంగపుత్ర స్థానిక సంఘం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పద్మారావు

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 254వ అన్నదానం నిర్వహించారు. రోడ్ల పక్కన, పుట్‌పాత్‌లపై ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులు, నిరాశ్రయులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ సభ్యులు కీర్తి, మానస, రోషిణి, ఇర్ఫాన్, కోమల్, శుభం, అఖిల్, హరీశ్, నరేశ్‌లు తదితరులు పాల్గొన్నారు. –బన్సీలాల్‌పేట్

ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం కమిటీ నూతన అధ్యక్షుడిగా సోమ దయానంద్

బేగంపేట్ జూన్ 9: సికింద్రాబాద్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం కమిటీ నూతన అధ్యక్షుడిగా సోమ దయానంద్ నియమితులయ్యారు. ప్యారడైజ్ వద్ద ఉన్న ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాల్‌లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సోమ దయానంద్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమ దయానంద్ మాట్లాడుతూ.. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. ఆర్యవైశ్యులు ఇతర పేద విద్యార్థుల చదువుల కోసం ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో రూ. 20 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. సంఘాన్ని వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బొల్లారం డౌటన్ బజార్ భూలక్షమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్, టీపీసీసీ కార్యదర్శి నరసింహన్ కన్నన్

భూలక్ష్మమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

బొల్లారం: కంటోన్మెంట్ బొల్లారం డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్,సీనియర్ నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 1001 కొబ్బరి కాయలు కొట్టారు.శ్రీ గణేష్ ఎమ్మెల్యేగా గెలిస్తే అమ్మవారికి 1001కొబ్బరి కా యలు కొట్టి మొక్కు తీర్చుకున్నట్లుగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అర్వింద్,. జి.వి. బాల్‌రాజు,శ్రీధర్ యాదవ్, సంతోష్, సంప త్, నరేందర్, సతీష్, రషీద్, నిఖిల్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో శ్రీ గణేష్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం కంటోన్మెంట్ ఆరో వార్డు గడ్డం ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు స్వాగతం పలికి సన్మానం చేశారు.అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. –కటోన్మెంట్

త్వరలో బేగంపేట్ పాటిగడ్డ ఎంబీటీ నగర్ బస్తీ ఎన్నికలు

బస్తీ సమావేశంలో చర్చించుకుంటున్న ఎంబీటీనగర్ పాటిగడ్డ బస్తీ వాసులు

బేగంపేట్, జూన్ 9: బేగంపేట్ డివిజన్ పాటిగడ్డ బస్తీవాసులంతా ఆదివారం బస్తీ కమిటీ హాల్‌లో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు పాటిగడ్డ ఎంబీటీ నగర్ బస్తీ కమిటీ కొనసాగిందని ప్రస్తుతం ఈ కమిటీ రద్దు చేయబడినట్టు వారు తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి బస్తీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రస్తుతం ఏప్రిల్ నెలలోనే కమిటీ రద్దు అయిందని త్వరలోనే తిరిగి బస్తీ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించేంత వరకు బస్తీ పెద్ద మనుషులే కమిటీని నిర్వహిస్తారని వారు సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, షంషోద్దీన్, శేఖర్‌ముదిరాజ్,నాగరాజ్‌గౌడ్, యాదగిరి, మారయ్య, చిరు, నసీం భాను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావాణి

సికింద్రాబాద్, జూన్ 9: నేటి నుంచి సికింద్రాబాద్ జీఎచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ రవి కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరి ష్కారం కోసం ప్రతి సోమవారం తమ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పార్ల మెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశా మన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి యథావిధిగా కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఉప్పల్, జూన్ 9 : నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్ ప్రాంతంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమానికి కృషిచేస్తున్నామని చెప్పారు. కాలనీల్లో రోడ్డు పనులను పూర్తిచేసి, పలు సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికతో ముందుకుసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, ముత్యంరెడ్డి, బుచ్చన్నగౌడ్, శ్రీనునాయక్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో బీజేపీ నాయకుల సంబురాలు

భారత ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో అడ్డగుట్ట బీజేపీ నాయకులు ఆదివారం సాయంత్రం స్వీట్లు పంచుకొని సంబురాలను చేసుకున్నారు. తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వద్ద నేతలు పెద్ద ఎత్తున సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సీహెచ్ కన్నాభిరాం, కృష్ణ, నర్సింగరావు, సాయిబాబా, రవీందర్, ఉదయ్‌కుమార్, మహేందర్, స్వామి, శ్రీనివాస్, ప్రేమ్, చారి, శ్యామ్‌సుందర్, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. – అడ్డగుట్ట

రామోజీరావు చిత్రపటానికి నివాళి

ఈనాడు సంస్థ చైర్మన్ రామోజీరావు మృతి చెందడంతో సికింద్రాబాద్ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన మృతికి సంతాపంగా నామాలగుండు చౌరస్తాలో టీడీపీ నాయకులు సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్,సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు కృష్ణలు రామోజీరావు చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. –సికింద్రాబాద్

మైనర్లను చేరదీసిన రైల్వే పోలీసులు

మారేడ్‌పల్లి, జూన్ 9: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు మైనర్ బాలురు (బాలిక, బాలుడు)లను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు చేరదీసి సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్లు ఆదివారం దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ప్లాట్ ఫారం నెంబర్ 2 లో మైనర్ బాలురులిద్దరు ఒంటరిగా కూర్చోని ఉన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రైల్వే పోలీసులు ప్లాట్ ఫారం నెంబర్ 2 లో తనిఖీలు చేస్తుండగా ఈ ఇద్దరు మైనర్ చిన్నారులు కనిపించారు. ఎక్కడి నుంచి వచ్చారు..ఎందుకు వచ్చారు.. .పోలీసులు వారిని అడుగగా ఇంటి నుంచి పారిపోయి వచ్చామని పోలీసులకు తెలిపారు. వెంటనే వారిద్దరిని చేరదీసి చత్తీస్‌ఘడ్‌లో ఉన్న మైనర్ బాలుర తల్లిదండ్రులకు, అక్కడి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటి వరకు వారిని సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించగా వారు శిశు విహార్‌కు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జూన్ 9: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆదివారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకు న్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

మల్లాపూర్: ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు తాడూరి గగన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తానన్న హామీని అమలు చేయాలన్నారు.

సగం రోడ్డుతోనే సరిపెడతారా..

● పార్సిగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న స్థానికుల

ముషీరాబాద్, జూన్ 9: రాంనగర్–పార్సిగుట్ట మార్గంలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణదారులు రోడ్డు సెట్ బ్యాక్‌లో భాగంగా వదిలేసిన స్థలాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పాత రోడ్డు ఉన్నంత వరకు రోడ్డు వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పార్సిగుట్ట మార్గంలో కొత్త రోడ్డు వేసినా ఇరుకు మార్గంలో వాహనదారుల ఇక్కట్లు తప్పేలా లేవు. వాస్తవానికి రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు ఉన్నా అధికారులు అవేమి పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇటీవల పార్సిగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టిన అధికారులు తొలి దశలో బ్రహ్మంగారి టెంపుల్ కమాన్ వరకు రోడ్డును నిర్మించారు. రెండవ దశ రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రహ్మంగారి కమాన్ నుంచి బాలాజీ స్వీట్ షాపు వరకు రోడ్డు నిర్మించే పనులు వారం రోజులుగా చేపడుతున్నారు. రాంనగర్ ప్రధాన రోడ్డు నుంచి కొంత దూరం వరకు భవన నిర్మాణదారులే స్థలాలు వదిలినా అధికారులు రోడ్డు వేయడానికి వెనకాడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా తవ్వకాలు చేపట్టిన అధికారులు పాత రోడ్డు ఎంత వరకు ఉందో అంతే తవ్వి రోడ్డు నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి పలువురు నిర్మాణ దారులు వదిలిన స్థలాలను తిరిగి అక్రమించుకోవడం, పుట్‌పాత్‌లపై నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పార్సిగుట్ట మార్గంలో మధ్యలో తవ్వి వదలేసిన రోడ్డు

టౌన్‌ప్లానింగ్ అధికారులు సహకరిస్తే రోడ్డు వేస్తాం..

టౌన్ ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్‌లపై ఉన్న నిర్మాణాలు, సెట్ బ్యాక్ వదిలిన స్థలాలను సేకరించి ఇస్తే రోడ్డు నిర్మాణం చేపడతాం. వారు సహకరిస్తే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మిస్తాం. –మురళి, ఏఈ సర్కిల్–15

విద్యార్థుల ఉన్నతికి ప్రతిభా పురస్కారాలు దోహదం : స్పీకర్ గడ్డం ప్రసాద్

తెలుగు యూనివర్సిటీ, జూన్ 9 : ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతాయని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ అన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 2023–24విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200మంది వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ఆదర్శనగర్‌లో గల బీఎం బిర్లా ఆడిటోరియంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపట్ల భరత్, కార్యదర్శి కడపల్ల సోమేశ్వర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సంగమేశ్వర్, కేంద్ర కమిటీ సభ్యులు మల్లికార్జున అప్ప, శెట్టి శివకుమార్, దినేశ్‌పాటిల్, శివశరణ్, రాచప్ప, డాక్టర్ శివప్ప, గాజుల శివకుమార్, మహిళా అధ్యక్షురాలు సూర్యశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు ప్రదానం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మహిళల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జూన్ 9: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఫోరం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న మహిళా చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో చట్టసభల్లో మహిళలకు కల్పించాలని, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం దక్కే వరకూ మహిళలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జూబ్లీహిల్స్, జూన్ 9: వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. తాగునీటిలో వర్షపు నీరు కలిసి వ్యాధులు ప్రబలే అవకావముండడంతో అత్యవసర వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తుంది. బస్తీల్లో ఔట్ రీచ్ హెల్త్ క్యాంప్‌లు, వెక్టర్ బోర్న్ డిసీజెస్ (వీబీడీ) క్యాంప్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానల పరిధిలో ప్రస్తుతం వస్తున్న కేసులపై దృష్టి పెట్టిన అధికారులు ఆయా సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే దోమలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో పాటు సీజనల్ డిసీజెస్ నివారణకు ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వర్షాలు ఉధృతమైతే తీసుకోవాల్సిన చర్యలపై పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు.

బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి

ఉప్పల్, జూన్ 9: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్‌లోని శ్రీసాయిత్రిశక్తి పీఠంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తిరుపతి నుంచి శ్రీబాలజీ, శ్రీబాలు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ వేదిక అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహిస్తుందని, అనేక పథకాలతో బ్రాహ్మణులకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు మాట్లాడుతూ ఐటీరంగంలోని బ్రాహ్మణులకు సత్కార మహోత్సవం నిర్వహిస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు కిషన్‌రావు, పావనిశర్మ, సహకార్యదర్శి మల్లికార్జునరావు, చొడవరకు శ్రీనివాస్, శారదా, ఉజ్వలాకుమారీ, రమణి, ఫణిభూషణ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మోహల్లా సంక్షేమ సంఘం నూతన కమిటీ

హిమాయత్‌నగర్, జూన్ 9: రాజ్‌మోహల్లా సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా డి.వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిరిల్ జేమ్స్, ఉపాధ్యక్షులు ఆర్.అరుణ్‌కుమార్, పి.దామోదర్, ఇ.ప్రభుదాస్, పి.మాణిక్యమ్మ, సహాయ కార్యదర్శులు బి.నర్సింగ్‌రావు, ఎంవీ రామకృష్ణ, పి.శివకుమార్, సహాయ కార్యదర్శి కె.మంజుల, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జి.రామ్‌మోహన్, ఎస్.క్రాంతి, కె.శ్రీశైలం, కోశాధికారి ఎ.శేషగిరిరావు, సహాయ కార్యదర్శి టి.కమల్‌నాథ్, సలహాదారులు జి.జానకిరాం, పి.గౌతమ్ రాజు ఎన్నికైయ్యారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్‌లోని శిల్పారామంలో ఆదివారం ఆంధ్రనాట్యం నృత్యప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నది. అలరింపు, వినాయక కౌతం, గంగాధర, ఆగణిత, నిన్ను మించిన, సరస్వతి, దశావతారాలు, తిల్లాన, నవగ్రహాలు, ప్రవేశదరువు, తదితర అంశాల్లో ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అక్షయ చర్య తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్

ప్రజలకు ఇబ్బందులు రాకుండా పనులు

జూబ్లీహిల్స్, జూన్ 9: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. ఆదివారం హనుమాన్ టెంపుల్, చర్చి గల్లీల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన సీవరేజీ, రోడ్డు పనులపై స్థానికులతో చర్చించారు. హనుమాన్ టెంపుల్ నుంచి బంగారు మైసమ్మ ఆలయం వరకు మధ్యలో నిర్మించాల్సిన రోడ్డు పనుల విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.